అమెరికా తెలుగు సంఘం, అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన పొందినకథ

# నీరూ... నీరూ... నీవెక్కడ?

-కె. శ్రీవాణి

చిన్నతనం నుండీ పల్లెటూళ్ళో ఉన్న నాకు ఒక్కసారిగా సిటీలోకి వచ్చేసరికి ఆడుతూ పాడుతూ ఉండాల్సిన వయసులో ఇంటి బాధ్యతలు నెత్తికెక్కించుకోవాల్సిన ఆడపిల్లలా...

ఇదే ప్రపంచం అనుకునే బావిలోని కప్ప ఒక్కసారిగా బావిలోంచి బయటకొచ్చినట్లుగా...



ఎంతో కష్టపడి కట్టుకున్న గూడు తిరుగొచ్చేసరికి మాయమైన పక్షిమొఖంలా...

నాలో రంగులు మారాయి!

అయినా ఏం చేస్తాం? 'చేసుకున్నంతవారికి చేసుకున్నంత మహదేవా' అని ఊరికే అన్నారా?

తనేమో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆడపిల్లాయె అక్కయ్య పెళ్ళితోనే ఉన్న ఆస్తీ హరించుకుపోగా ఏదో ఉన్నంతలోనే ఏ ఊరివాడికో ఇచ్చి చేద్దాం అనుకునే సమయంలో సరిగ్గా హీరోలా ఊడిపడ్డారు!

మరీ హీరో కాకున్నా జీరో మాత్రం కాదు సుమండీ? ఓడ్యూయెటన్నా పాడుకుందామన్నా సమయంలేనంత తొందరగా పెళ్ళి చేశారు.

అత్తపోరూ లేదు... మామపోరూ లేదు గాని

ట్రాన్స్‌ఫర్‌ల పోరు మాత్రం తప్పలేదు సుమీ!

పర్యవసానమే ఈ సిటీ నివాసం.

స్వచ్ఛమైన గాలే ఆహారంగా బ్రతికిన నాకు ఇంట్లో కుంపటి పెట్టుకున్నట్లుగా ఉంది.

ఇవన్నీ ఆయనకు చెబ్దామనుకుంటే ఎక్కడ "పల్లెటూరి బైతు" అనే చీదరించుకుంటాడేమోనని భయం!

అలాని ఆయనేదో రాక్షసుడనో... లేక తాగి తందనాలాడి నన్ను తంతున్నాడనో నేను చెప్పను!

ఎందుకంటే ఆయన ఎప్పుడూ నన్ను సంతోష పరచడానికే ప్రయత్నించేవాడు.

తను అలిగితే బుజ్జగించేవాడు.

బాధపడితే ఏవేవో జోక్స్ చెప్పి నవ్వించేవాడు!

అందరి భర్తల మాటెలా ఉన్నా తన భర్త మాత్రం శ్రీరాముడు కాదు అలాగని శ్రీకృష్ణుడూ కాడు.

ఆయనకున్న అలవాట్లు మరీ చెడువీకావు! రోజుకో డబ్బా చొప్పున సిగరెట్లు కాల్చడం... దేవుడికి పూజగ్గానీ నమస్కారంగ్గానీ చేయకపోవడం లాంటి చిన్న చిన్న నాకు నచ్చని అలవాట్లున్నాయి.

మా ఊర్లో అయితే ప్రతిరోజూ సాయంత్రం అరుగులమీద పెద్ద మీటింగ్ జరుగుతుండేది.

ఇక్కడ మీటింగ్ కాదుగదా కనీసం మేము వచ్చి మూడు నెలలైనా పక్కింటి వాళ్ళ పేర్లు తెలీవు.

పోనీ తనే తొందరగా పరిచయం చేసుకుందామను కునేలోగా వాళ్ళు ఊరుకెళ్ళిపోయారు!

మాట్లాడిచ్చినా మాట్లాడ్తారో లేదో...

ఎందుకంటే వాళ్ళు మాకన్నా బాగా ఉన్నవాళ్ళాయె!

ఈయనేమో ప్రొద్దున తొమ్మిదిగంటలకెళితే సాయంత్రం ఆరుకాంది రారాయె! పిల్లా... పీచూ ఉన్నా కాలక్షేపంగా ఉండేదనుకున్నా పెళ్ళై ఆరునెలలేగాఅయ్యింది!

ప్రొద్దుటే ముగ్గుగిన్నె పట్టుకుని వాకిట్లోకొచ్చిన నాకు 'కెవ్వ్'మని కేకేయాలన్పించింది.

కారణం పక్కింటికి తాళం లేదు.

హమ్మయ్య వాళ్ళు వచ్చినట్లున్నారు. తనే వెళ్ళి మాటిమాటికీ పలకరిస్తూ పరిచయం చేసుకుంటే తనకు ఇంత బోర్‌గా ఉండదు.

ఇష్టముంటే మాట్లాడ్తారు లేకుంటే లేదు. అంతేగా!

ఉన్నపళాన వెళ్ళి మాట్లాడించాలనుకున్నా ఆయన కింకా వంటచెయ్యలేదనే విషయం జ్ఞాపకం వచ్చి వాయిదా వేసానా ప్రోగ్రామ్‌కి!

వంటింట్లో పనిచేసుకుంటోన్న నాకు బయటిగలాటా విన్పించి కాస్త అనుమానం వచ్చింది. ఇంతసేపూ నాకా విషయం జ్ఞాపకం రానందుకు నా జ్ఞాపకశక్తిని నేనే మెచ్చుకున్నా!

ఈ రోజు మంచినీళ్ళ ట్యాంక్ వచ్చేరోజు. మా కాలనీలో వారానికి రెండుసార్లు మంచినీళ్ళ ట్యాంక్ వస్తుంది.

మంజీర నీళ్ళు సుమండీ! అందుకే బిందెకు పది రూపాయలు. అయినా ఎగబడి మరీ కొనుక్కుంటారు ఇక్కడి జనాలు.

గబుక్కున రెండు బిందెలు చేతుల్లో ఒక బిందె చంకలో ఇరికించుకొని వెళ్ళాను.

మాటవరుసకైనా పలకరించుకోని వాళ్ళుసైతం ఎంతో ప్రాణస్నేహితుల్లా మాట్లాడుకుంటున్నారు!

మరో అయిదు నిముషాల్లో ముష్టియుద్ధం... ఒక్కొక్కళ్ళ భాషా పాండిత్యమూ బయటపడ్డాయి.

పీడిన జుట్టుతో... చెదిరిన బొట్టుతో... నలిగిన చీరతో... అధ్వానంగా తయారయింది నా పరిస్థితి

అయినా నీళ్ళైతే దొరికాయిలే అన్న ఆనందం ముందు అదంతా బలాదూరే!!

మరో పదినిముషాల్లో ఇప్పటి సంఘటనని డామినేట్ చేసే మరో సంఘటన జరిగింది.

మా పక్కింటాయన తన ఇంట్లో దొంగలు పడ్డారని... అంతా దోచుకెళ్ళారని లబోదిబో మంటున్నారు.

'అయ్యోపాపం'! అన్పించింది. ప్రక్కనే ఉన్నా తాము తెల్సుకోలేకపోయామేమిటా? అన్పించింది.

దొంగతనం చేసేవాడేమైనా చెప్తాడుగనకనా తెలియడానికి! వాళ్ళు తెలియకున్నా వెళ్ళి ఓదార్చిరావాలి అని బలంగా అన్పించింది. మరేమీ ఆలోచించకుండా బయలుదేరాను.

ఏడవడానికి కూడా శక్తిలేనట్టుగా ఉందా ఇల్లాలి ముఖం. దగ్గర కూచొని ఓదార్పుగా భుజంపై చెయ్యేసాను.

"అలా బెంబేలు పడితే ఎలాగండీ వదినెగారు! డబ్బుదేముందండీ ఇవ్వాళ కాకపోతే రేపైనా తిరిగి సంపాదించుకోవచ్చు" అన్నాను సౌమ్యంగా.

"నా బాధ అదికాదండీ! వెధవ డబ్బు! అదిపోతే మీ అన్నయ్య బాధపడ్డారేమోగాని నేను మాత్రం బాధ పడనండీ" అంది పక్కింటి లక్ష్మి.

"మరి మీరు ఎందుకు బాధపడ్తున్నట్టు?" అడిగాను అర్థంకాక.

"నా బాధంతా నీళ్ళ గురించేనమ్మా! దొంగవెధవలు అన్నివేలు కొట్టేసినా ఇంకా వాళ్ళ దాహం తీరనట్టుగా నేను అతిభద్రంగా కాపాడుకున్న నీళ్ళన్నీ తాగేశారమ్మా! బంగారంలాంటి నీళ్ళు! మళ్ళీ ఆ నీళ్ళు సంపాదించడ మనేది ఈ జన్మలో జరుగుతుందనే ఆశ నాలో లేదండి! ఓరి భగవంతుడా..."

ఆపై ఏ మాటలు నా చెవికెక్కి నవ్వాలో ఏడ్వాలో అర్థంకావటం లేదు.

డబ్బూ, దస్కం పోయినందుకు కాదు మూడుబిందెల నీళ్ళు పోయినందుకే వీళ్ళ ఏడ్పు?

అంతగా జటిలంగా తయారైన నీళ్ళ సమస్యననాలో... వాళ్ళననాలో తెలియటంలేదు.

ఇంకా ఏడుస్తూనే ఉందామె! నీరూ... నీరూ... నీవెక్కడా? అని అడుగుతున్నట్టుగా అన్పించి అక్కణ్ణించి వచ్చేసా.

కె. శ్రీవాణి
కామారెడ్డి




బి.సుధీర్, బి - 39/15, లాబ్ క్వార్టర్స్, కంచన్ బాగ్, హైదరాబాద్ - 500 258